నల్ల రిబ్బన్లు ధరించి నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో గిరిజ నేతరురాలు బుడ్డిగా కొండమ్మ ఇల్లు, షాపులు కూల్చి వేయాలని ఆదివాసి గిరిజనులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. నల్లని రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. అనంతరం అదివాసీ గిరిజనులు మాట్లాడుతూ, గిరిజనేతరులకు సహకరిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలు కూల్చే వరకు దీక్షలు ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో అదివాసీ నాయకులు కిల్లో రామారావు, డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కో కన్వీనర్ కుడేలి నూకరాజు, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు సీ హెచ్ రాజు, ఆదివాసీ గిరిజన నాయకులు పాడి సుమన్, నర్సింగరావు, సూరిబాబు, కొర్ర ఆనంద్, బాలన్న పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

మోడీ ప్రభుత్వానికి తలొగ్గిన వైసిపి సర్కారు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం - మన్యం బంద్‌కు మద్దతుగా ఆదివాసీ జన రక్షణ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -పాడేరు: కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసీపీ సర్కారు పూర్తిగా తలొగ్గిందని, గిరిజన చట్టాలను హక్కులను కాలరాసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం ధ్వజమెత్తారు. ఈ నెల 10న చేపట్టిన రాష్ట్ర మన్యం బంద్‌కు మద్దతుగా పాడేరు ఐటిడిఏ ఎదుట శుక్రవారం చేపట్టిన ఆదివాసీ జనరక్షణ దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలకు, భర్తీ చేసేందుకు ప్రకటించిన పోస్టులకు ఏ మాత్రమూ పొంతన లేదని దుయ్యబట్టారు. 534 పోస్టులకుగానూ 38 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శించారు. రంపచోడవరం పరిధిలో 11 మండలాలకుగాను మూడు మాత్రమే ఖాళీలు ప్రకటించారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదన్నారు. గిరిజన నిరుద్యోగులకు 7 పోస్టులు మాత్రమే ఇవ్వడం అత్యంత దుర్మార్గమన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోస్టులు వారికే కేటాయించాలని డిమాండు చేశారు. ఆదివాసీ మాతృబాష వాలంటీర్లను తక్షణమే రెన్యూవల్ చేసి కొనసాగించాలని తెలిపారు. సిపిఎం ఒత్తిడితో యుపిఏ ప్రభుత్వం అటవీ హక్కుల పరిరక్షణ చట్టం తీసుకు వచ్చిందని, హక్కు పత్రాలు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పైగా కార్పొరేట్ కంపెనీల కోసం చట్టాల్లో సవరణలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 3 పునరుద్ధరణ కు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.గిరిజన సమస్యల పరిష్కారానికి, హక్కులు కాపాడాలని కోరుతూ 10న మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు.

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ జీవో 3 రిజర్వేషన్ చట్టబద్ధతకై టీఏసి ఆమోదించిన నూతన రెగ్యులేషన్ ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి ఆదివాసి ప్రాంతంలో గిరిజనులకే నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి మాతృభాష వాలంటీర్లను తక్షణమే రెన్యువల్ చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతగిరి జడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ, జీవో 3 పునరుద్ధరణకు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులుగా మిగిలారన్నారు. హైడ్రో వంటి ప్రాజెక్టుల కోసం ఇచ్చిన అక్రమ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు వారి సీట్ల కోసం పాట్ల పడుతున్నారని, గిరిజన సమస్యలు పట్టలేదని దుయ్యబట్టారు. గిరిజన హక్కులు చట్టాలు నిర్వీర్యం అవుతుంటే గిరిజన ఉప ముఖ్యమంత్రి, ఎస్టీ కమిషన్ చైర్మన్ చోద్యం చూస్తున్నారని విమర్శించారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు 10న చేపడుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, నాయకులు జి.చినబాబు, ఎస్‌బి పోతురాజు, సుందర్ రావు, కె.రామారావు, త్రినాధ్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆదివాసీ జన రక్షణ దీక్షలో కూర్చున్న సిపిఎం నాయకులు లోకనాథం, అప్పలనర్స, సురేంద్ర, గంగరాజు, తదితరులు

నినాదాలు చేస్తున్న సిపిఎంలో చేరిన కుటుంబాలు, పార్టీ నాయకులు

గిరిజనులకు ఎల్లప్పుడూ సిపిఎం అండ

- వివిధ పార్టీల నుండి 35 కుటుంబాలు సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిక

ప్రజాశక్తి-కూనవరం : ఏజెన్సీలోని గిరిజనులకు సిపిఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందనివైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బురద గూడెం గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 35 కుటుంబాలు శుక్రవారం సిపిఎం ప్రజా సంఘాల్లో చేరాయి. వారికి కండువాలు వేసి సిపిఎంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్టంలో వైసీపీ ప్రభుత్వాలు గిరిజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ఆదివాసీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. జిఒ నెంబర్ 3 రద్దు, అటవీ హక్కుల చట్టం సవరణ చేయడం, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఇవ్వక పోవడం వంటి చర్యలతో గిరిజనులకు ద్రోహం చేశాయని పేర్కొన్నారు. మరో వైపు సీపీఎం నిరంతరం ప్రజలు, గిరిజనుల పక్షాన పోరాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నటికీ గిరిజనులకు సీపీఎం, ఎర్ర జెండానే అండగా ఉంటున్నాయని పేర్కొన్నారు. అందుకే సిపిఎంలో చేరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మడివి తమ్మయ్య, నాగయ్య, రామిశెట్టి, సర్పంచ్ బొగ్గా రామారావు, బొగ్గా సుబ్బయ్య, గుండం బాబురావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మన్యం రాజకీయాలపై గిరిజనేతరుల పెత్తనం

ప్రజాశక్తి -సీలేరు : నాడు సారా కాంట్రాక్టర్ల నుంచి నేడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల వరకు మన్యం రాజకీయాలపై గిరిజనేతరులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజాబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్వం మైదాన ప్రాంతాలకు చెందిన సారా కాంట్రాక్టర్లు తమకు కావాల్సిన వారికి టికెట్లు ఇప్పించుకొని వ్యాపారాలు సాగించేవారని తెలిపారు. తరువాత గంజాయి స్మగ్లర్లు, మైనింగ్ మాఫియా వారు తాము గెలిపించుకున్న ఎమ్మెల్యేలతో వాళ్లకు కావాల్సిన పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్ఆర్ఐలు, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ యాజమాన్యం ఆర్థిక సహాయం చేస్తున్నట్లు పలు విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. మన్యంలో ఉన్న మైనింగ్, సహజవనరులను కొల్లగొట్టడమే వీరి లక్ష్యమని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీపీ గిరిజన చట్టాలపై అవగాహన లేదని, బోగస్ గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తూ నిజమైన గిరిజనులు హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. ఇదే కొనసాగితే గిరిజనుల భవిష్యత్తు అంధకారమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -చింతూరు : మండలంలోని కుమ్మూరు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటితో పాటు సర్వం కోల్పోయిన అన్నిగ ప్రసాదు కుటుంబానికి టిడిపి చింతూరు మండల నాయకులు శుకరవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి 10 కేజీల బియ్యం, వంటనూనె, ఉల్లిపాయలు, టమాటాలు, బంగాళదుంపలు, దుప్పట్లు. కంచాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ చింతూరు మండల అధ్యక్షులు ఇలా చిన్నారెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శీలం తమ్మయ్య, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు తురం చిన్న ముత్తయ్య, తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి రవ్వ సునీత, నాయకులు కుంచ బాలకృష్ణ, పిసందులయ్య, శ్యామల వినోద్ కుమార్, అణిగి చంద్రయ్య, హరిబాబు, పి.సల్మాన్ రాజ్, పి.రామారావు, నూకాచారి పాల్గొన్నారు.

మన్యం బంద్‌ను జయప్రదం చేయాలి

-పలు గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈ నెల 10 న జరిగే మన్యం బంద్ ను విజయవంతం చేయాలని శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం అధ్వర్యంలో మండల కేంద్రం, డుంబ్రిగుడ మండలం అరకు సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ, జీవో 3ను పునరుద్ధరణ చేసి గిరిజనులకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి, ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పోస్టులు లేని డీఎస్సీ ఎవరి కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని ప్రశ్నించారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి శిక్షణ పొంది ఆశతో ఎదురు చూస్తున్న సమయంలో డీఎస్సీలో పోస్టులు లేకపోవడంతో నిరుద్యోగులు ఆవేదన చెందారన్నారు. ఈ కార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పి,సురేష్, సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జి బాబు, సత్యనారాయణ, కోగేష్ కె.మగ్గన్న, డొంబు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివాసి గిరిజన సంఘం మండల నేతలు ప్రచారం చేపట్టారు. జీవో 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వ వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. . ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌లో నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగమూర్తి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

అరకులో ప్రచారం చేపడుతున్న నాయకులు

గిరిజన మహిళల వినూత్న నిరసన

ప్రజాశక్తి-అనంతగిరి: మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కివర్ల పంచాయతీ జగడాలమామిడి, తెంగిళ్లబంధ, సీమరాయి ఆదివాసి గిరిజన మహిళలు శుక్రవారం డోలి మోతతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాలకు రోడ్ల పనులు 2020 సంవత్సరంలో ప్రారంభించినా నేటికీ పూర్తి చేయలేదని, నిధులు స్వాహా చేశారన్నారు. నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఉన్నతాది.కారులు కనీసం పర్యవేక్షణ చేయలేదని మండి పడ్డారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేనప్పుడు డోలి మోత తప్ప మరో మార్గం లేదని, దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె రంగ, చిన్నాలమ్మ, సిదరి చిలుకమ్మ పాల్గొన్నారు.

డోలీ మోస్తూ నిరసన చేపట్టిన మహిళలు

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు భర్తీ చేయడానికి ఈనెల 25 వరకు గడువు ఉందని, అర్హులైన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఎంఈఓ ఎస్ సుందర్‌రావు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఒకటవ తరగతిలో ప్రవేశాలకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు.హెచ్ఐవి బాధితులు, వికలాంగులకు ఐదు శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు నాలుగు శాతం సీట్లు ఉన్నాయన్నారు. బీసీ, మైనారిటీ, ఓసిలకు లక్షా ఇరవై వేల లోబడి ఆదాయం ఉండాలన్నారు. ఏప్రిల్ ఒకటిన లాటరీ విధానంలో విద్యార్థుల తొలి లిస్టు విడుదల చేస్తారన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

ప్రజాశక్తి - చింతపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక హనుమాన్ కూడలి వద్ద వీరబ్రహ్మేంద్ర సేవ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు లక్కోజు నాగభూషణం, కిలో పూర్ణచంద్రరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి హుకుంపేట: -పాడేరు హుకుంపేట మండలంలోని సరిహద్దు ఆడారిమెట్ట సమీప బిర్జ బ్రిడ్జి వద్దకు గురువారం రాత్రి ఉరేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.స్థానిక ఎస్సై పి.సతీష్ కథనం ప్రకారం... అడ్డారిమెట్ట బ్రిడ్జి వద్ద ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు పాడేరు మండలం రాములు పుట్టు గ్రామానికి చెందిన బొండ జ్యోతి ఆదిత్య (21)గా గుర్తించారు. గత రెండేళ్ల కిందట అమ్మ నాన్నలు చనిపోవడంతో అమ్మమ్మ ఇంటి వద్ద ఆదిత్య ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పాడేరు ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పదంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృత దేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ ఆయన తెలిపారు.

రాజవొమ్మంగిలో పోటెత్తిన భక్తులు

శివాలయాలు కిటకిట

పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని రంప గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహళ్లి అభిషేకం చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఎఎస్‌పి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లబ్బర్తి, కుంతీదేవివాక, వాతంగి, చీకుదారా, కిర్రాబు గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. జడ్డంగి రాజువొమ్మంగి శివాలయాల వద్ద కళ్యాణ మహోత్సవం, ఊరేగింపు, భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సీఐ సన్యాసినాయుడు, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు ఎస్ వెంకయ్య, రఘునాధరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు శివాలయానికి భక్తులు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. దారకొండ భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

డుంబ్రిగుడ : మరిడిమాంబ, డుంబ్రిగూడలోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

హుకుంపేట : మండలంలోని మఠం పంచాయతీలోని మత్స్యగుండం వద్ద మత్స్య లింగేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఐటీడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ దర్శించుకున్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

కశింకోట : మహాశివరాత్రి సందర్భంగా అమీన్ సాహెబ్ పేటలోని స్వయంభు సాంబ శివలింగేశ్వర ఆలయాన్ని శుక్ర వారం వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ మెహెర్ నివేదిత దంపతులు దర్శించుకొని, గిరి ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మలసాల రమణారావు, ధనమ్మ పాల్గొన్నారు.

మండలంలోని పేరంటాలపాలెం, సోమవారం గ్రామాల్లో శివాలయాలను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, పెంటకోట రాము పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామి, నాగులపల్లిలో పర్వతవర్ధిని సహిత రామలింగేశ్వరస్వామి, వెంకటాపురంలోని నీలకంటేశ్వర, సిరసపల్లిలో వీరభద్రస్వామి, మునగపాకలో కాశీ విశ్వేశ్వర, పాలేశ్వర భీమేశ్వర, సాంబమూర్తి ఆలయాలు ఉదయం నుండి భక్తులతో కిటకిటలాడాయి. వెంకటాపురం, నాగులపల్లిల్లో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అచ్యుతాపురం : పూడిమడక సముద్రంలో జాగరణ స్నానాలు చేశారు. శివాలయాల ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిమ్మరాజుపేట, ఎం.జగన్నాధపురం, హరిపాలెం, కొండకర్ల, మడుతూరు, చమలపల్లి, పెదపాడు, జగ్గన్నపేట, దుప్పుతురు, సెజ్ కాలనీ తదితర గ్రామాలలో శివాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

చోడవరం : చోడవరం స్వయంభు గౌరీశ్వర ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు పాల్గొన్నారు. ముదుర్తి, రాయపురాజుపేట, గోవాడ, జుత్తాడా, గవరవరం, లక్కవరం గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారు మెట్ట తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ తమరాన దాసు, కాళ్ళ కోటేశ్వరరావు, పెనుపోలు రామానాయుడు,జడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి నేత దొండా నారాయణమూర్తి పూజలు చేశారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట నీలకంఠాపురం, రాజాం, పెదపూడి తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, గునూరు మల్లు నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గొండుపాలెం, మేడిచర్ల, ఎ.కోడూరు, ఆనందపురం, కె.కోటపాడు, కింతాడ లంకవానిపాలెం, చంద్రయ్యపేట, ఆర్లి తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పలు శివాలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.

నక్కపల్లి : మండలంలోని ఉపమాక శివాలయంలో భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ చెరుకూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గొడిచెర్లలో శేష లింగేశ్వర స్వామి, పాటిమీద శివాలయానికి భక్తులు బారులు తీరారు.

కోటవురట్ల : కోటవురట్లలోని రామలింగేశ్వర స్వామి, జల్లూరు, పందూరు, తంగేడు, రాజుపేట, వెంకటాపురం, లింగాపురం, సుంకపూరు, శివాలయాలకు భక్తులు తరలి వచ్చారు. పాములవాక పట్టాలమ్మ తల్లి గుడి వద్ద దీపారాధన నిర్వహించారు. కోటవురట్ల శ్రీవిద్వాన్ పాఠశాల వద్ద విద్యార్థులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొలుగొండ : మండలంలోని దారమఠం ఆలయం భక్తులతో పోటెత్తింది. డిఎస్పీ మోహన్ దారమఠంలో పర్యటించి భద్రతా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కెడిపేట నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

గాజువాక : అప్పికొండ సోమేశ్వర ఆలయానికి జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడిపింది. డిసిఎ, ఎసిపి ఆధ్వర్యంలో 500మంది పోలీసులు బందోబస్తు కల్పించారు. అపరిశుభ్రతకు తావులేకుండా పారిశుధ్యసిబ్బంది చర్యలు చేపట్టారు.

ఆనందపురం : పొడుగుపాలెం, పెద్దిపాలెం, దుక్కవానిపాలెం, గుడిలోవ, వేమగొట్టిపాలెం, గిడిజాల, శొంఠ్యాం, కుశలవాడ, కణమాం పంచాయతీ అరిగిమేరక గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పొడుగుపాలెంలో ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి, ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ, కర్రోతు సత్యం పూజలు చేశారు. అరిగిమేరకలో యువ నేత పినిశెట్టి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పద్మనాభం : మండలంలోని వికె.పాలెం, మద్ది, అనంతవరం, గంధవరం, తునివలస, బి తాళ్లవలస కొర్రపల్లి రెడ్డిపల్లి పద్మనాభం, పొట్నూరు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెడ్డిపల్లి శివాలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. అనంతవరంలో సర్పంచ్ జి.లక్ష్మి, పెద్ద ఎర్రిబాబు దంపతుల ఆధ్వర్యంలో మూడు వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు.

ఆరిలోవ : పెదగదిలిలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడుకోలా బంగారయ్య ఆధ్వర్యంలో మహాశివరాత్రి పూజలు జరిగాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి రామన్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి చల్లా రాజు, పాల్తేరు శ్యామ్, ఒమ్మి వెంకట్, బొట్ట కనకరాజు పాల్గొన్నారు.

అట్టహాసంగా కళ్యాణపులోవ ఉత్సవాలు

కొత్తకోట : కల్యాణపులోవ పోతురాజుబాబు (శివుడు) పెద్దింటమ్మ తిరుణాళ్లు అట్టాహసంగా ప్రారంభమయ్యాయి. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల ఆధ్వర్యంలో లక్ష వాటర్ ప్యాకెట్లు అందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, కొత్తకోట సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ సుధారాణి, ఎంపీపీ రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్, మండల కన్వీనర్ జగన్నాధరావు స్వామివారిని దర్శించుకున్నారు. కొత్తకోట పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ వీరజ్యోతి సందర్శించారు. కొత్తకోట మెయిన్ రోడ్డులో స్థానిక వాసవి క్లబ్ న్యూ, వనిత క్లబ్, సిద్ధి వినాయక యూత్, వీరబ్రహ్మేందరస్వామి తదితరులు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మజ్జిక, పులిహోర పంపిణీ చేసారు. కొత్తకోట వాసి ఉల్లూరి రాజు ఆధ్వర్యంలో తన వ్యవసాయ పాకల వద్ద ఉచిత మజ్జిక చలివేంద్రం ఏర్పాటు చేసారు.

కల్యాణపులోవకు భారీగా తరలివచ్చిన భక్తులు

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

సర్వం కోల్పోయిన బాధితుడు

ప్రజాశక్తి - ఎటపాక : మండలంలోని విసాపురం పంచాయతీ పరిధి సాలెబుడప గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. సాలెబుడప గ్రామానికి చెందిన కొవ్వాసి ఇడమ ఇంటికి శుక్రవారం నిప్పు అంటుకొని ఇల్లు మొత్తం కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లో ఉన్న రూ.7వేలు నగదు, బంగారు గొలుసు, 10 ధాన్యం బస్తాలు, బియ్యం, గృహోపకరణాలు, మంచాలు, బట్టలు, వంట పాత్రలు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంకు పాసుబుక్‌లు, రేషన్ కార్డు, జాబ్ కార్డులు అన్ని అగ్నికి ఆహుతయ్యాయి. ఆహారధాన్యాలు కాలిపోవడంతో తినడానికి తిండి, కట్టుకోడానికి బట్టలు కూడా లేవని కొవ్వాసి ఇడమయ్య కన్నీటి పర్యంతమయ్యాడు.

సిపిఎం నాయకుల పరామర్శ

అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు సాలెబుడప గ్రామానికి వెళ్లి కాలిపోయిన ఇంటిని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. సిపిఎం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకొనే ప్రయత్నం చేస్తామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఆకిశెట్టి రాము, పెనుబల్లి ధర్మరాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

పలుచోట్ల మహిళా దినోత్సవం

కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, మంగవేణి

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పురుషులతో సమానంగా అన్నింటా రాణిస్తున్న మహిళల సేవలను కొనియాడారు. వివిధ రంగాల్లో విశేషంగా రాణించిన మహిళామణులను సత్కరించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఎంవిపి.కాలనీ : ఎన్ఎస్‌టిఎల్‌లోని మోహపాత్ర మానసి అడిటోరియంలో 'ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్' థీమ్‌తో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ పూణె మాజీ డైరెక్టర్, వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియా అబ్రహం హాజరయ్యారు. కార్యక్రమంలో నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ క్లస్టర్ ప్రథమ మహిళ వై.లక్ష్మి, ఎన్ఎస్‌టిఎల్ ప్రథమ మహిళ ఇలీన్ దీనా అబ్రహం, డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, సైంటిస్ట్ డాక్టర్ బి.మమత పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఫిషర్‌మ్యాన్ కాలనీ, అప్పుఘర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి ప్రారంభించారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో లయన్ 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డి.సూర్యప్రకాష్, రీజియన్ ఛైర్మన్ లయన్ యన్.సుధాకరరావు, జోన్ ఛైర్మన్ లయన్ దుర్గా ఆనంద్, ప్రెసిడెంట్ లయన్ ఎం.ఎం.మహేష్, సెక్రటరీ లయన్ వివియన్.నాయుడు పాల్గొన్నారు. స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ధనలక్ష్మి తదితరులు మహిళా దినోత్సవం సందర్భంగా కార్పొరేటర్ జి.మంగవేణిని సన్మానించారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ ప్రతినిధి జివిఎల్.పద్మ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ మాట్లాడారు. మహిళా చట్టాలను పాలకులు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. బీచ్ రోడ్డులోగల వైఎంసిఎ వద్ద పాపా బాలిక హోంలో సహజ యోగా మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి యాంత్రిక జీవనంలో మహిళలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని సహజ యోగా ట్రస్ట్ రాష్ట్ర ప్రతినిధి పద్మావతి సింహాద్రి అన్నారు. జాతీయ ట్రస్ట్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సుభాషిణి, సహజ యోగా ట్రస్ట్ ఎపి కో ఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

మధురవాడ: గీతం వర్సిటీ మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు, అధ్యాపకులు హెల్త్ వాక్‌లో పాల్గొన్నారు. మహిళా సాధికారకతపై వివిధ రంగాల నిపుణులతో చర్చావేదిక, మహిళల చేతివృత్తుల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి బహుమతులు అందజేశారు. గీతం మహిళా సాధికారిక విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ వి.బి.శ్రీవిద్య, డాక్టర్ బాలాకుమార్ పాల్గొన్నారు.

పెందుర్తి : విశాఖ నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ భాను పాల్గొన్నారు. కాలేజీ ఛైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్స్ శ్రీధర్ పట్నాయక్, ప్రసాద్, డయానాపాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని గంధవరంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నాలుగోత నాగమణి పాల్గొన్నారు.

విశాఖపట్నం : పెద జాలరిపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళా దినోత్సవంలో యుపిహెచ్‌టిసి వైద్యాధికారి డాక్టర్ ఎంవివి. మురళీమోహన్, గీతం కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలను ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళా వైద్యులు నస్రీన్, శిరీష, సుపర్ణ , లక్ష్మి , సీత, ఇతర మహిళా ఉద్యోగులను సత్కరించారు హెచ్‌ఆర్ .మేనేజర్ శివప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కె.బంగారురాజు పాల్గొన్నారు.

సీతమ్మధార: మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ద్వారకానగర్ బ్రాంచ్‌లో మహిళా దినోత్సవంలో విశాఖ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ పద్మ పాల్గొని మహిళా సాధికారితపై మాట్లాడారు. సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం : మహిళా దినోత్సవం సందర్భంగా 92వ వార్డు కార్యాలయంలో జివిఎంసి కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించి చీరలు అందజేశారు. ఔట్ సోర్సింగ్ సూపర్వైజర్ దమ్ము శ్రీనివాసరావు తల్లి దమ్ము సత్యవతిని సన్మానించారు. ఎనిమిదోజోన్ మెడికల్ ఆఫీసర్ కృష్ణంరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ రమణ, ఇన్‌స్పెక్టర్లు గోపి, సన్యాసిరావు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

అనందపురం: వేములవలస కూడలిలోని ఆర్ఎంపి ఉత్తరాంధ్ర జోనల్ కార్యాలయంలో ఆర్ఎంపి మహిళా సంఘం జోనల్‌కార్యదర్శి ఎన్. సుగుణేశ్వరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి. అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ పాల్గొని కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం సభ్యులు భవాని, అను, కళ, అన్నపూర్ణ, రేవతి, విజయలక్ష్మి, సీతారత్నం మేఘన, గయా రాధిక పాల్గొన్నారు

ఆరిలోవ :ఆరిలోవ హెల్త్ సిటీ అపోలో ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని ఫోక్సో న్యాయమూర్తి ఆనంది, డాక్టర్ సతీష్ ప్రభ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గోలైట్ రోడ్రిక్స్, రెడ్ ఎఫ్ఎం శర్మిల, వైభవ్ జ్యూవెలరీస్ సిఎండి మల్లికా రత్నకుమారి, ఐరన్ లేడీ అవార్డు గ్రహీత షహనాజ్, నారీ శక్తి అవార్డు గ్రహీత ప్రసన్న శ్రీ, జిటో ప్రెసిడెంట్ ప్రసన్న బెయిడ్, యు వైజాగ్ ఛైర్మన్ శిల్పాంజలి దంతు పాల్గొన్నారు.

అనకాపల్లి : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, దేశాభివృద్ధిలో తమదైన పాత్ర పోషించాలని స్థానిక ఎంపీ డాక్టర్ బివి సత్యవతి అన్నారు. స్థానిక సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె అనంతలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులో ఉత్తమ సిబ్బందికి అవార్డులు అందజేశారు. అనంతరం జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ భీశెట్టి వరహ సత్యవతితో పాటు పలువురుని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, కార్పొరేటర్లు లక్ష్మి సౌజన్య, కొణతాల నీలిమ భాస్కర్, జడ్పిటిసి బూడి అనురాధ, ఆర్జెడి చిన్మయి దేవి, ఏఎస్ఐ మణి కుమారి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో అనకాపల్లి ట్రైనీ డిఎస్‌పి జి.భవ్యారెడ్డి పాల్గొని మాట్లాడారు. కళాశాలలో పనిచేస్తున్న మహిళలకు ఆటలు పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్. మహేశ్వరరావు, కరెస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, అనురాధ పాల్గొన్నారు.సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చ రల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యాన స్థానిక సబ్ జైల్‌లో మహిళా ఖైదీలకు 'మహిళలు.. కరుణకు ప్రతి రూపాలు' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ వై.గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవానికి ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మీ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు భవిరిశెట్టి బంగారు బాబు, అధ్యక్షులు పద్మావతి, వాసవి క్లబ్ మెంబెర్లు, మహిళలు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైసిపి మహిళా ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి కళావతి, మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, సర్పంచులకు అభినందించారు.

మారేడుమిల్లి : స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్ సత్యవేణి అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవంలో కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా సిబ్బందికి చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రత్నశ్రీ, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, నాగరత్నం, ఐ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

మహిళా అధికారులను సత్కరిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి

చింతూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా టీచర్లు చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసం సుజాత, మిడియం సుజాత, తులసి, కవిత, సీత, మీనా, పాండ్రు, లక్ష్మి, పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:మండలంలోని కొత్తవలస గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినా మహిళల పరిస్థితిలో మార్పు లేదన్నారు. కమిటీ సభ్యులు సన్యాసమ్మ, లక్ష్మి, రాధా, సుందరమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి:మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలో కేబి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ మండల కో ఆర్డినేటర్ దుక్కెరి గంగమ్మ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేబి ఫౌండేషన్ చైర్మన్ కొక్కుల కన్నబాబు, జిల్లా కో ఆర్డినేటర్ వంతల నాగేశ్వరరావు, ముఖ్య సలహాదారుడు తలారి జానకిరామ్, మన్యం గాయకుడు దుడ్డు సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలోని బంగారుమెట్ట, వడ్డెపుట్, కొత్తప్యూట్టు గ్రామాల్లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా అధ్యక్షురాలు టి.కౌసల్య, పౌరహక్కుల, హత్యాచారాల నిరోధక చట్టం జిల్లా కమిటీ మెంబర్ చెండా లోహితాసుడు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గణేష్

మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో మహిళా దినోత్సవం

ఎన్ఎస్‌టిఎల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళామణులు

ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యాన..

మాట్లాడుతున్న ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు పద్మ

పోరాటాల ఫలితమే... : ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నో పోరాటాల ఫలితంగానే మహిళా దినోత్సవం ఏర్పాటైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి పద్మ అన్నారు. శుక్రవారం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు మణి అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాన హక్కుల కోసం 113ఏళ్ల క్రితం మహిళలు చేసిన పోరాటాన్ని వివరించారు. సమ్మెలు, అరెస్టులు, వివిధ ఉద్యమాలతో మహిళాదినోత్సవం సాక్షాత్కారమైందని, తర్వాతే మేడే, ఇతరత్రా పోరాటాలు రూపుదాల్చాయన్నారు. ఓపిక, శక్తిమంతులైన మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, నేటికీ వివక్షకు గురికావడంపై ఆవేదన వెలిబుచ్చారు. ఐద్వా స్టీల్ డివిజన్ కార్యదర్శి కె.వేణు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు వేగవంతమౌతున్న నేపథ్యంలో పోరాటంలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. తోకాడ సమైక్య అపార్టమెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నేటికీ మహిళలపై దాడులు, వేధింపులు కొనసాగడం దారుణమని, వీటిని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మన్మధరావు, ఐదవ స్టీల్ డివిజన్ అధ్యక్షులు కె.వరలక్ష్మి, అసోసియేషన్ కార్యదర్శి ఎ.తవితయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన మహిళా దినోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

అక్కిరెడ్డిపాలెంలో..అక్కిరెడ్డిపాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది.రమణమ్మ, శ్రీలక్ష్మి స్థానిక ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

గాజువాక : 71 వ వార్డు శ్రీరాంనగర్ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఐద్వా స్టీల్ జోన్ కార్యదర్శి కె.వేణు అధ్యక్షుతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఐద్వానేతలు కె. సంతోషం, కృష్ణవేణి, సంధ్య, ఎ.కుమారి, టి శాంతి, వై రాజేశ్వరి, భవాని, శ్రీదేవి పాల్గొన్నారు.

భీమునిపట్నం : హక్కుల కోసం మహిళలు ఐక్యంగా పోరాడాలని ఐద్వా భీమిలి డివిజన్ కార్య దర్శి కె నాగరాణి పిలుపు నిచ్చారు. భీమిలి జోన్ మరిడమ్మ పేటలో ఐద్వా ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు ఐద్వా జోన్ కమిటీ సభ్యులు ఎస్ గుణ, యు పార్వతి, కల్యాణి, లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు

పెందుర్తి :రైతుబజార్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఐద్వా నేత బి. రమణి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా హక్కులను కాలరాస్తున్నాయని, మహిళాబిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపినా అమలు జరగడం లేదన్నారు. సిఐటియు జిల్లా నాయకులు జగన్, అప్పలనాయుడు, అంగన్వాడీ జిల్లా సెక్రటరీ దేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మధురవాడ: జివిఎంసి ఐదవ వార్డు శారదా నగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జోన్ కార్యదర్శి బి భారతి మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దామన్నారు. ఐద్వానేతలు ఎల్ పద్మ, ఆర్ లక్ష్మి, ఎం గాయత్రి, ఆర్ భారతి, బి శశి పాల్గొన్నారు

ములగాడ : మహిళదినోత్సం సందర్భంగా శ్రీహరిపురం నుంచి కోరమండల్ వరకు సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ, సభ నిర్వహించారు. ఐద్వా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మమత, ఆర్.విమల మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా హక్కులను కాలరాస్తోందన్నారు. ఐద్వా సభ్యులు నిర్మల, అరుణ జగదీశ్వరి, కృష్ణవేణి, ఈశ్వరమ్మ, గీత, రుద్ర, పొలమ్మ సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, బి.రాంబాబు, కె.రమణ రాము పాల్గొన్నారు.

సీతమ్మధార : హామీలలోనే తప్ప అమలులో మహిళాసాధికారిత సాకారం కావడం లేదని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగరాపు ప్రియాంక అన్నారు. అక్కయ్యపాలెంలో శ్రామిక మహిళా కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సదస్సులో మాట్లాడుతూ, చట్టాలన్నీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంన నిర్వీర్యం చేస్తుంటే, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కనీసం ప్రశ్నించే స్థితిలో లేదని, మహిళా హక్కులను పోరాడి సాధించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో కుమారి, జ్యోతి, సుందరి, సూర్య కుమారి పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

అనకాపల్లి : మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి మండలం సంపతిపురంలో ఐద్వా పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా హక్కులకు రక్షణ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పసిపిల్లలు, వృద్ధ మహిళలు అన్న భేదం లేకుండా అందరిపైనా లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కె.లావణ్య, కె.లక్ష్మి, కె.వరలక్ష్మి, బి.లక్ష్మి, కె.జయ, కోనిశెట్టి లక్ష్మి, ఎస్.శాంతి, జి.బంగారమ్మ, కోరుకొండ రత్నకుమారి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

రాజవొమ్మంగి:స్కీం వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో లోతా రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులు, ఆత్మగౌరవం కోసం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వాన్ని సాధించడానికి మహిళలను ప్రోత్సహించడం మహిళా దినోత్సవం ముఖ్య ఉద్దేశని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా, మిడ్డే మీల్స్ సంఘాల నాయకులు సిహెచ్.కుమారి, రమణి, రాజేశ్వరి, చిన్నమ్మలు, మేరీ, రత్నం, భవాని, రాధ, లక్ష్మి, సత్యవతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐద్వా మండల కమిటీ సభ్యురాలు గంపల జయ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ మాట్లాడుతూ అవనిలో సగం ఉన్న మహిళలకు అన్నీ చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వెలుగు విఒఎ వై.విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు తోట రమణ, సావిత్రమ్మ, వెంకట నరసమ్మ, పద్మ, రజిని, డాక్టర్ దీనమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రియాంక

అనకాపల్లిలో ఐద్వా పతాకావిష్కరణలో మహిళా నేతలు

మల్కాపురంలో ఐద్వా ర్యాలీ

పెందుర్తిలో మాట్లాడుతున్న ఐద్వా నేత రమణి

రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న రామారావు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బాధితునికి చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో హౌసింగ్ కాలనీకి చెందిన పావాడ సన్యాసిరావు కుమారుడు బాలాజీకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చెక్కును గురువారం అందజేశారు. బాలాజీకి రెండేళ్ల క్రితం తలకు ఆపరేషన్ జరిగింది. గురువారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేయూత కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా సన్యాసిరావు ముఖ్యమంత్రిని కలిసి తన పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ సహాయం చేయాలని అభ్యర్థించారు. దీంతో సీఎం కలెక్టర్ రవి పఠాన్ శెట్టికి ఆదేశాలు జారీ చేయడంతో కలెక్టర్ కార్యాలయంలో బాలాజీతో పాటు, 19 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ లక్ష రూపాయల చెక్కులు అందించారు.

'దక్షిణం టికెట్ కేటాయించాలి'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజక్వర్గం టిక్కెట్టును అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లింలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చెంగలరావుపేట జామియా మసీదు, అల్లిపురం మసీద్ ఎ ఫిర్దోస్ వద్ద ముస్లింలు ప్రదర్శనలు నిర్వహించారు. ముస్లింలకు అసెంబ్లీ టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఎ ఫిర్దోస్ కమిటీ అధ్యక్షులు మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ విశాఖ జిల్లా జనాభాలో ముస్లింలు రెండో స్థానంలో ఉన్నారన్నారు. అయినప్పటికీ వారికి జిల్లాలో సరైన ప్రాతినిధ్యం ప్రధాన రాజకీయ పార్టీలు కల్పించకపోవడం దారుణమన్నారు. జామియా మసీద్ ప్రెసిడెంట్ అక్బర్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో 25 వేల మంది ముస్లిం ఓటర్లు ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమకు ప్రధాన పార్టీలు టికెట్ ఇవ్వకపోతే ముస్లిం నేత ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తారని తెలిపారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి

విజేతలను అభినందిస్తున్న మళ్ల సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : జమ్మూ కాశ్మీర్లో ఈనెల 26 నుంచి 30 వరకు జరగనున్న జాతీయ బాక్సింగ్ పోటీల్లో అనకాపల్లికి చెందిన బాక్సింగ్ క్రీడాకారులు సత్తా చాటాలని అనకాపల్లి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మల్ల సురేంద్ర ఆకాంక్షించారు. ఇటీవల విశాఖపట్నం గోపాలపట్టణంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో మారేడుపూడి కాలనీకి చెందిన ఈగల రక్షిత్, అడివి వరపు విశాల్, సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే నారపిన్ని తులసి రామ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మల్ల సురేంద్ర స్వగృహంలో వారిని అభినందించారు. బాక్సింగ్ రంగంలో అనకాపల్లికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా నేషనల్ ఇనిస్టిటూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ కోరుకొండ అరుణని సత్కరించారు. కార్యక్రమంలో కోచ్ కోరుకొండ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా మద్ది గోస్తనీ వంతెన

ప్రజాశక్తి -పద్మనాభం. మండలంలోని మద్ది వద్ద గోస్తనీ నదిపై వంతెన ప్రమాదాలకు నెలవుగా మారిందని వాహన దారులు బెంబేలెత్తుతున్నారు. విజయనగరం, సింహాచలం ప్రధాన మార్గంలో వంతెన కావడంతో ఈ రహదారిలో బైకులు, బస్సులు, కార్లు, ఆటోలు, లారీలు ఇతర వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో వంతెనపై ఖానాల మధ్య ఏర్పడ్డ ఖాళీల్లో బైక్స్, చిన్న వాహనాలు పడడంతో వీల్స్ విరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, పెద్దవాహనాలైతే ఎగిరెగిరి పడుతూ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. మద్ది వద్ద గోస్తని వంతెనపై నిత్యం నాలుగైదు ప్రమాదాలైనా సర్వసాదారణమైన నేపథ్యంలో సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గోస్తనీ వంతెనపై ఏర్పడ్డ గోతులు

మహిళల చదువు కోసం 'కలలకు రెక్కలు'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళల ఉన్నత చదువు కోసం టిడిపి, జనసేన కలిసి కొత్తగా కలలకు రెక్కలు కార్యక్రమం తీసుకువచ్చాయని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. అందుకోసం రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమెన్స్ డే సందర్భంగా కలలకు రెక్కలకు సంబంధించి ఓ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థినులు చదవలేకపోతున్నారన్నారు. కేవలం 20 శాతం మంది మాత్రమే డిగ్రీ చదువుతున్నారని తెలిపారు. కలలకు రెక్కలు కార్యక్రమం ద్వారా హయ్యర్ స్టడీస్‌కు వెళ్లవచ్చునని అన్నారు. 9261292612 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే వారికి సహాయం అందుతుందన్నారు. జగన్ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని తెలిపారు.

ముద్రగడతో కాపులు లేరు

ముద్రగడ పద్మనాభం వైసిపిలోకి వెళ్లినంత మాత్రాన కాపులు ఆయన వెంట వెళ్లరని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ చాలా క్లారిటీతో ఉన్నారన్నారు. ముద్రగడ వైసిపి కోవర్టు అని కాపులకు తెలుసునన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ: ఇంట్లో పనులు చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ చెప్పిన వివరాలివి. జివిఎంసి ఆరోవార్డు జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, గాయత్రినగర్ బ్లాక్ నెంబరు 10, జిఎఫ్1లో షేక్‌జిలాని (33) తన భార్య ఫాతిమాతో నివాసముంటున్నాడు. ఈనెల 5న ఇంట్లో పనిచేస్తుండగా, జిలాని ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో గాయపడ్డాడు.కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం రాత్రి మృత్యువాతపడ్డాడు. భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

స్టీమ్ లీకేజీతో ఇద్దరు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి -ములగాడ: స్టీమ్ లీక్‌తో ఇద్దరు కార్మికులు గాయాలు పాలైన ఘటన హెచ్‌పిసిఎల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి.

హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీలోని డిహెచ్‌టిఎస్‌ఆర్‌యు షట్ డౌన్ పనుల్లో భాగంగా పైపులైన్లను స్టీమింగ్ చేస్తుండగా ఒక్కసారిగా లీకేజీ కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రమోద్‌సింగ్, స్వరూప్ అనే ఇద్దరు సిఆర్3 కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంస్థ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అనంతరం ఆరిలోవ అపోలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సంస్థ అధికారులు గాయపడిన కార్మికులను పరామర్శించారు. మల్కాపురం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు,

ఆసియా రోడ్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ కోసం..

ఇండియన్ ఆయిల్, ఎఫ్ఐఎం భాగస్వామ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆసియా రోడ్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ కోసం అధికారిక ఫ్యూయల్ భాగస్వామ్యానికి ఎఫ్ఐఎం (ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి మోటోసైక్లిస్మే) ఇండియన్ ఆయిల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుందని ఇండియన్ ఆయిల్ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం మూడేళ్ల పాటు ఉంటుందన్నారు. ఎఆర్ఆర్‌సి ఈవెంట్‌లలో స్టార్మ్ అల్టిమేట్ రేసింగ్ ఫ్యూయల్ కేటగిరీ 2 రేస్ ఇంధనాన్ని అందించనుందన్నారు. ఇండియన్ ఆయిల్ గుజరాత్ రిఫైనరీలో ఈ స్టార్మ్ ఉత్పత్తి అవుతుందన్నారు.